


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

39

అశాంతితో కొట్టుమిట్టాడిపోతున్న భారతికి అనుకోకుండా ఒకమార్గం తోచింది. అదే నాటకం!ఇప్పుడు జనం ఇంచుమించు మరిచిపోయిన కళారూపం, అప్పట్లో జనాదరణ విపరీతంగా ఉన్నదృశ్యరూపకం! ఆ ఆలోచన కూడా చాలా విచిత్రంగా వచ్చిందామెకు. ఒకసారి కలువలపల్లె గ్రామానికి చెందినలింగేశ్వరరావుగారి బృందం 'అందరిల్లు'లో శయనమ్మగారి వర్థంతి సందర్భంగా జరిపిన సంస్మరణసభానంతరం ఒక నాటకాన్ని ప్రదర్శించారు. అది వరకట్న దురాచారానికి సంబంధించి వ్రాయబడ్డది. ఆనాటక ప్రదర్శన చూడటానికి జనం విరగబడ్డారు. ఆ రోజుల్లో వినోద సాధనం అదే మరి. ఆ నాటకంలోలింగేశ్వర రావుగారు చొప్పించిన సందేశం జనానికి బలంగా చేరటం భారతి గమనించింది.

అప్పుడే ఆమె మనసులో గొప్ప ఊహ మెదిలింది. తను సమాజంలో గమనిస్తున్న సమస్యలు, వాటిపరిష్కారాల గురించి ప్రసిద్ధికెక్కిన నాటక రచయితలను వేడుకొని నాటకాలను తయారు చేయించింది.లింగేశ్వర రావు గారికి తన ఉద్దేశ్యం చెప్పి స్త్రీ జన చైతన్య ప్రేరకాలుగా వాటిని తీర్చిదిద్దమని ప్రార్థించింది.లింగేశ్వరరావు గారు వెంటనే అంగీకరించారు. ఆయన స్త్రీలు నాటక రంగంలోకి రావటాన్ని ఎంతోప్రోత్సహించేవారు. తన శిష్యబృందంలోని స్త్రీలచేత ముఖ్యపాత్రలు ధరింపచేస్తూ వివిధ నాటకాలను శ్రీరామనవమి పందిళ్ళలో, వారోత్సవాలలో ప్రదర్శింప చేశారాయన. అంత గొప్ప కళాకారుని ఆధ్వర్యంలోజరిగిన ఆ ప్రదర్శనలకు ఇసుకేస్తే రాలకుండా వచ్చారు జనం.

ఇదో అద్భుతమైన ప్రయోగం. ప్రతి నాటకం మధ్యలోనూ భారతి ప్రసంగించేది. ఏ సమస్య వున్నాతనను సంప్రదిస్తే ఎవ్వరితోనూ వారి వివరాలను బయటపెట్టకుండా, ఆ సమస్య పరిష్కారానికి తానుతోడ్పడతానని వారికి నమ్మకం నూరిపోసేది. నాటకంలో స్త్రీ పాత్రల చేత కూడా అందరింటి భారతిని సంప్రదిస్తేఆమె తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సహకరించిందని చెప్పించేది. చేదుమందైనా తీపి పూతతో తినిపించవచ్చు. ఆడవారి ఏ సమస్యకైనా అందరిలు పరిష్కారంచూపిస్తుందని ఆ నాటకాల ద్వారా స్త్రీలందరినీ చైతన్యవంతులను చెయ్యగలిగింది భారతి. వారం రోజులప్రదర్శన ముగిశాక లింగేశ్వరరావుగారికి ఘనసన్మానం చేయించింది భారతి. అలా ఒకఆరునెలలపాటువరుసగా చేసేసరికి ఆడువాళ్ళకి ఆమె సందేశం చేరింది. ఆమె కృషి ఊరికే పోలేదు. స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాల వంటి వాటి గురించి జనంలో అవగాహన పెరిగింది. ఆ ఆరు నెలలలో ఆమె దిక్కులేని ఎనిమిదిమంది వితంతువులకు పునర్వివాహాలుచేయించగలిగింది. సుమారు నలభైకి పైగా బాలికలు శయనమ్మ బాలికోన్నత పాఠశాలలో కొత్తగా చేరారు.

ఇంచుమించు ప్రతినెలా కులాంతర వివాహాలకు వేదిక అయ్యేది అందరిల్లు. అయితే అక్కడ జరిగే ప్రతివివాహం ఆర్థిక స్థిరత్వం ఉన్నవారికే జరిపించేది భారతి. అటు పెద్దల అండ, ఇటు ఆర్థిక స్థిరత్వం వీటిలో ఏదోఒకటి లేకపోతే ఆ వివాహాలు జయప్రదం కావని ఆమె అనుభవపూర్వకంగా గ్రహించిన సత్యం. చట్టపరమైన సహాయం కావలసిన వారికి రవి అండగా నిలబడేవాడు.ఇక గృహిణుల ఆర్థిక స్వావలంబన కోసం భారతి వాళ్లకి రకరకాలైన చేతిపనులలో, వృత్తి విద్యలలో శిక్షణ ఇప్పించేది. చదువుకోగలిగిన వారిని చదివించే ఏర్పాట్లు చేసేది. ఆసక్తిని బట్టి ఆ రోజులలో అమ్మటానికి వీలైన అన్ని రకాల వస్తువులను ఉత్పత్తి చెయ్యటానికి వారికి శిక్షణనిప్పించేది. చాపలు, చేటలు, బుట్టలు వంటివి తయారు చెయ్యటంలో, పెళ్లిళ్లలో వడ్డించే అప్పడాలు, వడియాలు మొదలైనవి తయారుచేయడంలో, నేర్చుకోగలిగినవారికి బట్టలు కుట్టడంలో, కూరగాయల పెంపకంలో ఇలా అన్నిటిలోనూ వాళ్ళ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు శిక్షణాకార్యక్రమాలు ఏర్పాటు చేసేది. మహిళలు వీటిలో పాల్గొని ప్రశంసాపత్రాలు పొందేవారు. ఈ శిక్షణ అవసరాన్ని బట్టి రోజులనుంచి, వారాలు, కొన్ని కొన్నిసార్లు నెలలు కూడా సాగేది. అందులో పాల్గొనటంలో వారిలో ఆసక్తి పెంపొందించటానికి భారతి వారికి ఉచితంగా శిక్షణ ఏర్పాటు చేయటమే కాక ఉపకార వేతనంగా డబ్బును చెల్లించేది. క్రమక్రమంగా ఆమె కృషి సత్ఫలితాలనివ్వసాగింది. ఆ ఊరిలోని మహిళలే కాక పక్క ఊరినుంచికూడా మహిళలు అందరిల్లుకు రావడం ప్రారంభించారు. మొదటిసారిగా ఒక వార్తా పత్రికలో 'అందరిల్లు'గురించి ఒక వ్యాసం వచ్చింది. ఆ వ్యాసంలో భారతిని కూడా కొన్ని ప్రశ్నలడిగి, ఆమె ఇచ్చిన జవాబులు కూడా ప్రచురించారు. ఆ వ్యాస ప్రచురణానంతరం చాలాదూరం వరకూ 'అందరిల్లు' ఖ్యాతి పాకింది. అందులో శిక్షణ పొందిన మహిళలు చిన్న చిన్న కుటీరపరిశ్రమలు పెట్టుకోవడం మొదలుపెట్టారు.ఆర్థికంగా ఆ కుటుంబాలు సాధించిన ప్రగతిని చూసి మరింత మంది మహిళలు స్వచ్ఛందంగా ఆ కార్యక్రమాల్లో పాల్గొనటానికి వచ్చేవారు. రాను రానూ, వారి భర్తల ప్రోత్సాహంతో వచ్చే మహిళల సంఖ్యకూడా పెరగ సాగింది. భారతి చేస్తున్న ఈ కార్యక్రమాల గురించి దినపత్రికలలో బహుళ ప్రచారం లభించసాగింది.

## 40

కాలగమనంలో మరో నాలుగు సంవత్సరాలు గడచిపోయాయి. భారతికి రెండోకాన్పులోపుట్టిన కొడుకు శ్రీరామ్ కూడా బడికి వెళ్ళటం మొదలు పెట్టాడు. ముకుందం, మురారి, ప్రసాద్‌ల వివాహాలు జరిగి పోయాయి. వదినలిద్దరూ మంచివాళ్ళే. అన్నదమ్ముల అదృష్టానికి మనసారా సంతోషించింది భారతి. వచ్చిన తోటికోడలు కూడా చాలా మంచిది. ఇద్దరి పెళ్ళిళ్ళకీ రాజేశ్వరి వచ్చింది కానీ ఇదివరకటిలా అందరితో కలిసిమెలిసి ఉండలేదు. తను వారందరికంటే అధికురాలిననే భావం ఆమెలో అడుగడుగునా వ్యక్తమయింది.

మురారికి అక్కగారి అతిశయాలు అసలు గిట్టవు. భర్త వ్యాపారంలో సంపాదించి చేయించిన నగలు, కన్నవారు పెట్టిన నగలు అన్నీ దిగవేసుకు వచ్చింది రాజేశ్వరి. ఆమె కట్టిన చీరెలు, పెట్టిన నగలు ఆమెకు ప్రత్యేక గుర్తింపునైతే సంపాదించి పెట్టాయి జనంలో. వాపుని చూసి బలుపనుకున్నట్లు దాన్ని గౌరవమనుకుంది రాజేశ్వరి.

ఎవరివలన తనకీనాడు ఇంతటి స్థాయి వచ్చిందో ఆ పార్వతీశం ముందు కూడా అతిశయ ప్రదర్శనలో వెనుకడుగు వెయ్యలేదు రాజేశ్వరి. అత్తగారు, మామగారు ఆమెకు అసలు గిట్టట్లేదిప్పుడు. అనాగరికుల్లాగా కనిపిస్తున్నారు. వాళ్ళతో తాను సన్నిహితంగా మెలిగిన రోజులు గుర్తొస్తే తనమీద తనకే జుగుప్స కలుగుతుంది ఎం.పీ రాజేశ్వరికిప్పుడు. అత్తగారి ప్రేమపూరితమైన 'రాజమ్మా' అనే పిలుపు ఆమెకు ఇప్పుడు కంపరం కలిగిస్తోంది. వాడలో అందరూ గౌరవించే మామగారంటే అసలు లెక్కే లేదు. భర్త చెప్పే హితోక్తులు కూడా రుచించట్లేదు. జారుడుమెట్లపైన నడుస్తూ పైకి వెళ్తున్నాననుకుంటోంది రాజేశ్వరి. పెళ్ళప్పుడు లేని కులాధిక్య భావంతో సతమతమౌతోందిప్పుడు ఆమె. ఇంతకు ముందు నాగరాజంటే ఉన్న ప్రేమను ఇప్పుడు రాజకీయ అధికారం ఇచ్చిన దర్పం మింగేసింది. తను నాగరాజుని ప్రేమించి పెళ్లాడటం అతని అదృష్టం అన్నది ఆమె భావన ఇప్పుడు. ఆమె ఎలా ప్రవర్తించినా మురిసిపోయేది, ఆమె ప్రవర్తనను హర్షించేది తల్లి ఒక్కతే.

కూతురు తల్లి మీద ప్రభావం చూపించిందో, తల్లి కూతురికి కొత్త బుద్ధులు నేర్పిస్తోందోచూస్తున్న వాళ్ళకి అర్థం కాదు కానీ, వాళ్ళిద్దరూ సరైన దారిలో లేరన్నది జగద్విదితం. స్వాతంత్ర్య వీరుడుకేశవరావుగారి కూతురు హైమవతి, ఈ హైమవతి ఒకరేనా అనే అనుమానం అందరికి వస్తోంది.

తన ప్రవర్తనను ఆమోదించలేని పుట్టింటి వాళ్ళందరూ ఇప్పుడు రాజేశ్వరి దృష్టిలో తనను చూసి అసూయ పడేవారు. ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలనే సామెతను భారతి ఎంత వంట పట్టించుకుందో, అంత వదిలేసింది రాజేశ్వరి. కలిసిమెలిసి పెరిగిన అక్కాచెల్లెళ్ల స్వభావాలు ఒకరు ఆ చివరైతే, మరొకరు ఈ చివరన్నట్లు అయ్యాయి. ఏదేమైనా చెల్లెలితో మటుకూ ఆపేక్షగానే ఉంది రాజేశ్వరి.

"అది ఆపేక్ష కాదు. నీతో అవసరం తనకి. ఇంట్లో ఎవ్వరూ పనికిరానిది నువ్వు కావలసి వచ్చావా?" అన్నాడు మురారి ఆవేశంగా. నవ్వి ఊరుకుంది భారతి.

పెళ్ళిళ్ళు, పేరంటాలలో కలిసినప్పుడు అక్కగారికి పుట్టింటి వారిచ్చిందే కాక తను విడిగా పసుపుకుంకుమలిచ్చి పంపిస్తుంటుంది భారతి.

"నీకేదన్నా ప్రభుత్వ పరమైన పనులుంటే నన్ను కలవవే భారతీ. చేయిస్తాను" వెళ్ళే ముందు అంది రాజేశ్వరి దర్పంగా, అలాంటి ఓ సందర్భంలో. చిరునవ్వుతో తల ఊపింది భారతి. ఏమో, ఎప్పుడెవరితో ఏ అవసరం పడుతుందో!

★★★★★

అప్పటికే భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు మొదలయ్యాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక లక్ష్యం, రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం ఉన్న జీవనప్రమాణ స్థాయికి మళ్ళీ చేరటం. ఈ ప్రణాళిక అభివృద్ధిని పెద్దగా చూపించలేకపోయింది. కారణం బ్రిటిష్ వారి ఆర్థికవిధానాలతో, రెండవ ప్రపంచ యుద్ధంతో బాగా దిగజారిన భారతదేశ ఆర్థికపరిస్థితి. ఫలితంగా దేశమంతా ఒక విధమైన నిరాశ కమ్ముకుని ఉంది. కొందరిలోకొత్త ప్రభుత్వపాలన పట్ల నిరసన, పాలనావిధానం ప్రక్షాళించాలనే ఆలోచనలు కూడా మొదలయ్యాయి. తొలి ఎన్నికలలో ఎంపికైన వారిలో నిజాయితీపరులైన శాసనసభ సభ్యులు దేశానికి వాళ్ళ పరిధిలోసేవ చేశారు. అవినీతిపరులైన శాసనసభ్యులు దేశసేవకంటే బొక్కసం నింపుకోవడం మీద ఎక్కువ శ్రద్ధ చూపించారు. విచిత్రమైన విషయం ఏంటంటే, మొదటి ఎన్నికల కమిషన్ అధికారి సుకుమార్ గారి ఆధ్వర్యంలో నిర్వహింపబడిన ఆ ఎన్నికలలో భారత రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ ఓడిపోయారు. కారణం ఆయన కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చెయ్యక పోవటమే అని అందరూ చెప్పుకున్నారు. చూస్తూ చూస్తూ ఉండగానే ఏళ్ళు గడిచిపోయాయి.

భారతప్రధాని జవహర్‌లాల్ నెహ్రూగారి ఆధ్వర్యంలో రెండవ పంచవర్ష ప్రణాళిక రూపుదిద్దుకుంది. ఈసారి ప్రణాళిక లక్ష్యం ప్రభుత్వరంగంలో మౌలికపరిశ్రమల స్థాపన, అభివృద్ధి. సాంఘికలక్ష్యం సమసమాజ స్థాపన అని చెప్పవచ్చు. దేశం మరొకసారి ఎన్నికలను నిర్వహించుకోవడానికి సంసిద్ధమవుతోంది. రాజేశ్వరిఈసారి కూడా బరిలో దిగటానికి నిశ్చయించుకుంది. ఎవరి సహాయం అడగదలచుకోలేదు. పార్వతీశం గారికి ఇది బాగానే ఉంది ఎందువలనంటే ఆయనకు రాజేశ్వరి చేసిన కొన్ని పనులు నచ్చలేదు. అయినా చెప్పలేకపోయారు. ఆమె ప్రజాభిమానాన్ని దూరమయ్యిందన్న సంగతి ఆయనకు తెలుస్తూనే ఉంది.

41

రాజేశ్వరి మాట అలా ఉంచితే, భార్యలో వచ్చిన మార్పు ఆయనను ఎంతో కలతకు గురి చేసింది.ఎన్నో సంవత్సరాలు అనుకూలవతిగా ఉన్న భార్య ఈ నాలుగైదు సంవత్సరాల వ్యవధిలో ఇంతగా మారిపోవటం ఆయనను ఎంతో కలతకు గురిచేసింది, కానీ ఏం చేయగలడు? పెద్దకూతురు, భార్యలలో అధికారం తెచ్చిన మార్పు చూసి అమిత సంఘర్షణకు లోనయ్యింది పార్వతీశం అంతరాత్మ. కూతురు నిజాయితీకి, దూరమైపోతోందేమో అన్నది ఆయన అనుమానం, భయం. ఇది హైమవతి తాను కూతురికి చేస్తున్న ధనసహాయం గురించి ఆయన దగ్గర దాచటం వలన వచ్చిన అనర్థం. ఏ నిమిషాన ఎవరి నోట ఏమాట వినాలో అనే భయం ఆయన క్షణక్షణం చవి చూస్తున్నాడు.

రాజేశ్వరి కేవలం తాను వున్న ప్రాంతాన్ని బాగుచేయించిందే తప్ప, నియోజకవర్గం మొత్తంలో ఉన్న ప్రజల మంచి కోసం ఎటువంటి ప్రత్యేక కృషి చేయలేదు. వారందరూ తనకు ఓటు వేసి గెలిపించినవారు కనుక వారి సంక్షేమం తన బాధ్యత అన్నది గ్రహించే పరిపక్వత ఆమెకు లేదు. కొత్తగా వచ్చిన అధికారంతో చుట్టూ చేరిన జనం ఆమెకు చెప్పలేదు.

చెప్ప ప్రయత్నించిన కుటుంబ సభ్యులు, హితులు ఆమెకు నచ్చలేదు. తన ఎంపీ ఎన్నిక తనకు ఒక పెద్ద బాధ్యత అన్నది ఆమెకు తెలియదు. అప్పటివరకు సేవాకార్యక్రమాల్లో ఎన్నడూ పాలుపంచుకోని ఆమెకు అధికారమిచ్చిన హోదాతో అందరి నమస్కారాలు అందుకోవటంలోనే కాలం
గడిచిపోయింది.

పదవీకాలం ముగిసేలోగా ఆమెతో పనులున్నవారు ఆమెను మంచి చేసుకుని, పొగిడి తమకుకావలసిన పనుల తాలూకు కాగితాల మీద సంతకాలు పెట్టించుకున్నారు. ఈలోగా ఎన్నికల ప్రకటన రానేవచ్చింది. ఈసారి ‘అందరిల్లు’ భారతి అక్కయ్యగా సీటు ఖాయమయ్యింది రాజేశ్వరికి. అయితే ఆమె ఒక విచిత్రమైన సమస్య ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్నికల సందర్భంగా ఎక్కడ ప్రజలను కలిసినా ఆమె గుర్తింపు భారతి అక్కయ్యగానే! నియోజకవర్గంలో ఏమూలకు వెళ్లినా భారతి పేరుచెప్తే జేజేలు కొట్టేవారు జనం. రాజేశ్వరిలో కొద్దిపాటి ఆత్మవిమర్శ మొదలైందని చెప్పవచ్చు. పార్లమెంట్ సభ్యురాలిగా ఆమె చేసిన అభివృద్ధి పనులు ప్రస్తావించినా రాని గుర్తింపు, భారతి పథకాల గురించిన ప్రస్తావన రాగానే వచ్చేది. ప్రజలలో అమిత ఆదరణ ఉన్నది భారతికే కానీ, తనకు కాదన్న సత్యం అవగతమయ్యింది రాజేశ్వరికి. ఆమెతో ఉన్న సలహాదారులు కూడా ఆమెకు భారతిని ఒకసారి కలిస్తే మంచిదనే సలహా ఇచ్చారు. ఇక తప్పలేదు రాజేశ్వరికి, భారతికి ఫోన్ చేసి తను ఎన్నికలలో గెలవటానికి సహకరించమని అడిగింది. భారతి నవ్వేసింది.

“నీకు నా సహాయమేమిటి అక్కా? గెలిచాక నువ్వే ‘అందరిల్లు’కి సహాయం చెయ్యాలి” అంది. భారతి మాటలతో రాజేశ్వరి అహం చల్లారింది.

చెల్లెలి పలుకుబడి పుణ్యమా అని మళ్ళీ అత్యధిక ఆధిక్యతతో గెలిచింది రాజేశ్వరి.

## 42

రవికి ప్లీడరుగా చాలా పేరు ప్రఖ్యాతులు వస్తున్నాయి. ముఖ్యంగా వచ్చిన కక్షిదారు తరపున న్యాయంఉందని నమ్మితే అతను పేదవాడైనా, ధనవంతుడైనా ఆ కేసులో వాదించటానికి సిద్ధపడేవాడు. తనకు వారిచ్చే డబ్బు ఎక్కువా, తక్కువా అనే విషయం అసలు పట్టించుకునే వాడే కాదు. దీనికి తోడు ‘అందరిల్లు’ నుంచి అతనికి దగా పడిన స్త్రీల తరపున వాదించేందుకు ఎన్నో కేసులు వస్తుండేవి. మొదట్లో అటువంటి కేసులను గెలవటం ద్వారానే అతను ఎనలేని పేరు సంపాదించాడు. ఆ కేసులలో అతను సాధించిన విజయాల గురించి వార్తాపత్రికలలో కథనాలు రావటంతో అతని పేరుప్రఖ్యాతులు రాష్ట్రమంతా వ్యాపించాయి. అనేకమంది కక్షిదారులు అతన్ని ఆశ్రయించటం మొదలుపెట్టారు. రవి కొద్దికాలంలోనే ప్రముఖ ప్లీడరుగా స్థిరపడ్డాడు. కీర్తిలక్ష్మిని ధనలక్ష్మి కూడా అనుసరించటంతో అతను పురప్రముఖుల్లో ఒకడయ్యాడు.

★★★★★

మొట్టమొదటిసారిగా ఎంతో విశాలమైన 'అందరిల్లు' భవనం అందరికీ సరిపోకపోవడం మొదలయ్యింది. అది కేవలం మహిళలకే కాక వృద్ధులకు, అనాథలకు కూడా ఆశ్రయం ఇస్తూ ఉండటంతో, ఉండే వాళ్ళు ఎక్కువయ్యి భవనం చిన్నది అయింది. భారతి పక్కనే ఉన్న విజయవాడ పట్టణంలో ఒక శాఖను ప్రారంభించటానికి నిర్ణయించింది. దానిని చూసుకోవటానికి మురారీ, అతని భార్య వెళ్ళటానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. కానీ మురారి వెళ్లిపోతే పార్వతీశం పొలాలను ఎవరు చూసుకుంటారు అన్న సమస్య ఎదురయ్యింది. దానికి సమాధానం పార్వతీశానికి అదే దొరికింది. పార్వతీశం ముఖ్యమైన స్నేహితుడు ప్రభాకరరావు కొడుకు చంద్రం, చదువుకుని ఆధునిక పనిముట్లు వాడి వ్యవసాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు.

ముందుగా ట్రాక్టర్ కొనాలి అనుకున్నాడు చంద్రం. అయితేట్రాక్టర్ని కేవలం తమ చిన్న పొలంలో వాడటం లాభసాటి కాదు కనుక అతను అంతకు ముందు రోజే పార్వతీశంని కలిసి తనకు ఆయన పొలాన్ని కౌలుకి ఇస్తాడేమో అని అడిగాడు. అతని సమర్థత గురించి పార్వతీశానికి ఒక అవగాహన ఉంది. ఇప్పుడు పార్వతీశానికి కావలసింది కూడా అటువంటి యువకుడే. ఆనందంగా అతనికి తన పొలాన్ని కౌలుకు ఇవ్వటానికి సంసిద్ధతను వ్యక్తం చేశాడు. సహకార వ్యవసాయం చేయడంలో ఉన్న లాభాలను గురించి అప్పటికే వ్యవసాయ కమిటీల వాళ్ళు ప్రజలను చైతన్య పరుస్తున్నారు, అందువలన పార్వతీశం తనకు రెండోవైపు ఉన్న సత్యనారాయణ పొలాన్ని కూడా చంద్రానికి కౌలుకి ఇప్పించాడు. అతనికి ఏ విధమైన సహాయసహకారాలు కావలసి వచ్చినా అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశాడు. ఈ విధంగా వ్యవసాయం ఎవరు చూసుకుంటారు అనే ఆలోచన లేకుండా పోయింది.

మురారి వేరే ఊరికి వెళ్ళటానికి అంగీకరించి ప్రోత్సహించటంలో మరో ఆలోచన కూడా ఉంది పార్వతీశానికి. హైమవతి దగ్గర లేకపోవడంతో ఇంటిభారం అంతా పెద్దకోడలి మీద పడుతోంది. ఆమెఇటీవల ఆ విషయం పట్ల కొంచెం అసంతృప్తితో ఉండటం అర్థమవుతోంది. దానికితోడు ఇది ముకుందానికి కూడా తన సమర్థతను నిరూపించుకునేందుకు ఒక అవకాశమని పార్వతీశం భావించాడు. ఇంతకాలం వ్యవసాయంలో తన సొంతంగా అతను చేసింది ఏమీ లేదు. వటవృక్షం ఛాయలో చిన్న మొక్కలు ఎదగవు
కదా.

★★★★★

అందరిల్లును స్వతంత్రంగా నిర్వహించటం అంటే ఎంతో సమర్థత ఉంటే కానీ సాధ్యం కాదు.ముకుందం సమర్థత పట్ల భారతికి రవికి ఎంతో నమ్మకం ఉంది. అందువలన విజయవాడ శాఖను ముకుందం చూసుకోవటం ఆమెకు మనస్ఫూర్తిగా ఇష్టమే. ప్రారంభోత్సవానికి శారదమ్మ, పార్వతీశం, ప్రసాద్, రవి, భారతి, కృష్ణ, సరళ అందరూ

సంతోషంగా వెళ్ళటానికి తయారవుతుంటే హైమవతి రాజేశ్వరి పిల్లలతో ఇబ్బంది పడుతుంది కనుక వాళ్ళతో వస్తానంది. అలిమేలు, శ్రీనివాసులను తప్పనిసరిగా రమ్మని భారతి పిలిచింది. ఈ మధ్య కొత్తగా కొన్నటువంటి కారులో రవి, భారతి, శారదమ్మ, పిల్లలు వెళ్లారు. భారతి మరొక కారు ఏర్పాటు చేస్తానని ఎంత బతిమాలినా ఒప్పుకోకుండా పార్వతీశం అలిమేలు, శ్రీనివాసులు కలిసి బస్సులో వెళ్ళాడు.

అక్కడ కొన్న భవంతి రెండువేల గజాలలో ఎంతో విశాలంగా వున్నది. భవనం ముందరి స్థలంలో శయనమ్మగారి విగ్రహ స్థాపనతో సహా మొత్తం భవంతిని అందరింటిలాగానే తీర్చిదిద్దారు. దైనందిన కార్యక్రమాలు సహా అన్నీ అందరిల్లులో లాగానే జరుగుతాయి. పురప్రముఖులందరి సమక్షంలో పార్వతీశం చల్లని చేతుల మీదుగా విజయవాడ 'అందరిల్లు' ప్రారంభమయ్యింది. పార్లమెంట్ సభ్యురాలయిన తను అక్కడ ఉండగా పార్వతీశంగారి చేతుల మీద ప్రారంభోత్సవం జరగటం రాజేశ్వరికి కొంత అవమానమనిపించినా బయటపడలేదు. అలిమేలు, శ్రీనివాసులు భారతి చేస్తున్న సేవాకార్యక్రమాలను పొగడటం కూడా రాజేశ్వరి కన్నెర్రకు కారణం అయ్యింది.

విజయవాడ శాఖ మొదలైన కొద్దిరోజుల్లోనే తెనాలి, పొన్నూరు, మంగళగిరి ఇటువంటి ఊళ్ళల్లో కూడా'అందరిల్లు' సేవాకార్యక్రమాలు విస్తరించాయి. ప్రజలు దాన్ని మెచ్చి వివిధపథకాలకు ఎవరికి తోచిన మొత్తం వారు చందాలివ్వటం మొదలు పెట్టారు. ఇచ్చిన ప్రతి పైసా సద్వినియోగం అవుతుందనే నమ్మకం వారికి ఉంది.

ఒకరోజు పొద్దున్నే భారతి ఇంట్లో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆమెకు ఫోన్ వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డిగారు ఆమెతో స్వయంగా మాట్లాడారు. ఆవిడ ద్వారా అమలు జరుగుతున్నటువంటి అన్ని సేవాకార్యక్రమాలు, వాటి ఫలితాల గురించి తనకు అనేకమందిచెబుతున్నారని, పత్రికల ద్వారా కూడా తెలుసుకున్నానని చెప్పారు. ఆమెకు ప్రభుత్వం తరఫున ఎటువంటిసహాయం కావలసిన నిస్సంకోచంగా తనను అడగమని చెప్పారు. ఆ సంవత్సరం ఆమె వివిధ

అందించిన సేవలను గుర్తించి గౌరవిస్తూ 'మహిళారత్న' పురస్కారప్రదానం చేస్తున్నామని అది ఆగస్టు 15వ తారీకున స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయబోతున్నామని చెప్పారు.

సాధారణంగా ముఖ్యమంత్రి అవార్డు గ్రహీతతో స్వయంగా మాట్లాడటం అనేది జరుగదు. అది భారతి సేవలకు లభించిన అరుదైన గుర్తింపు. 'మహిళారత్న' భారతికి లభించిన మొట్టమొదటి పురస్కారం. తరువాత ఆమెకు పురస్కారాలతో పాటు, ఆమెకు వచ్చిన జ్ఞాపికలను పదిల పరచటానికి ఒక పెద్ద చెక్కబీరువాను అద్దాల తలుపులతో చేయించాడు రవి. అందరూ భారతికి పురస్కారం లభించినందుకు ఎంతో ఆనందించారు. రవి, భార్యకు వచ్చిన గుర్తింపుతనకే వచ్చినంత సంబర పడ్డాడు. భారతి రవికి, శారదమ్మకు, పార్వతీశం దంపతులకు నమస్కరించింది.

కొద్దిసేపట్లోనే ఊరందరికీ ఈ వార్త తెలిసింది. ప్రతి ఒక్కరూ ఆనందించి భారతిని అభినందించారు. ఆ పురస్కారాన్ని తన పనిని మరింత బాగా చేయడానికి ప్రోత్సాహం కిందనే తీసుకుంది భారతి. శారదమ్మ భారతి అభివృద్ధిని

చూసి మరీ మరీ మురిసిపోతోంది. ఇక అత్తగారి వైపు మిగిలిన వాళ్ళందరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్ళేవాళ్ళే. ఆమె విజయాలకు ఆనందపడే ముకుందం వార్త వినగానే బయల్దేరి చెల్లెలిని చూడాలని వచ్చేశాడు. మురారి పరుగు పరుగున పంచదార తీసుకు వచ్చి ఆమె నోరు తీపి చేశాడు. రాజేశ్వరి వెంటనే బయల్దేరి వచ్చి చెల్లెలికి పూలదండ వేసి అభినందనలు తెలిపి ఒక ఫోటో తీయించుకుంది ఆమెతో. అది చూసి హైమవతి అంది,

"ఇంక మన రాజుకి కూడా ఇలాంటి అవార్డు ఏదో ఒకటి వచ్చేస్తే..."

"ప్రభుత్వం మామూలు పౌరులకు అవార్డులిస్తుందమ్మా. నేను ప్రభుత్వంలో భాగాన్ని." దర్పంగా అంది రాజేశ్వరి.

★★★★★

ఆ హడావిడి సద్దుమణిగాక, ఆ రోజు రాత్రి భారతి రవితో అన్నది, "మావయ్యా! ఇప్పటి వరకు నేను చేసినదానికి వందరెట్లు చేసినా ఇంకా చెయ్యాల్సింది ఉండనే ఉంది. ఈ మాత్రం చేయగలిగానంటే ఇదంతా నీ వల్లనే. నువ్వు నా పక్కన ఉంటే నేనేదైనా సాధించగలననే నమ్మకం నాలో పెరిగిపోతోంది మావయ్యా!"

"నాకూ నమ్మకం పెరిగిపోతోంది భారతీ, నువ్వు ఇంకా ఇంకా ఎంతో సాధించగలవని. నీకే తెలియని శక్తి నీలో ఎంతో ఉంది. దాన్ని సరైన దారికి మళ్లించటమే నేను చేసింది. ఇక నీకు తిరుగులేదు." రవి గొంతు ప్రేమకు నిర్వచనం చెప్పింది భారతికి.

"రవి మావయ్యా- - -"

"....మొగుణ్ణి పేరుపెట్టి పిలవకూడదే బంగారం!"

★★★★★

విజయవాడ నుండి ముకుందం ఒక విషయాన్ని భారతి దృష్టికి తీసుకు వచ్చాడు. ఒక హరిజన యువతి పక్కన ఉన్న చిన్న ఊరిలో పోలీస్ స్టేషన్లో బలాత్కరించబడింది. ఆ విషయం బయటపడటానికి ఆలస్యం జరిగింది. కారణం పోలీసులే నేరగాళ్లు ఈ కేసులో. ఈ విషయాన్ని కప్పిపుచ్చడానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ విషయం విన్న భారతి ఆవేశం ఆగలేదు. రవిని సహాయంగా తీసుకొని మరికొంతమంది స్వచ్ఛంద సేవకులతో కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళింది. అక్కడ జరిగిన సంఘటన తాలూకు వివరాలను ఆమెకు ఎవరూ ఇవ్వలేదు. చివరికి ఆమెకు ఆ హరిజన యువతి పేరు కూడా తెలియనివ్వలేదు. భారతి పట్టిన పట్టు విడవకుండా పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న అనేక ఇళ్లల్లో రహస్యంగా విచారిస్తే చివరికి చెప్పిన వారి పేరు బయటకు రాకుండా ఉంచే షరతు మీద ఆ యువతి పేరు చెప్పారు. ఆమె చిరునామా ఇచ్చారు. వాళ్ళు ఇచ్చిన ఆ చిరునామాకు వెళ్ళింది భారతి.

అయితే ఆ యువతి తనకు జరిగిన అన్యాయాన్ని బయటకు చెప్పేందుకు ఒప్పుకోలేదు. ఆమె ఒక పెళ్ళి అయిన యువతి. భర్త మీద అతను పనిచేస్తున్న సంస్థ యజమాని దొంగతనం నేరం మోపి జైలుకు పంపితే, అతను ఆ నేరం చేయలేదని పోలీసులతో మొర పెట్టుకోవటానికి వెళ్ళిన అరవిందను, ఆ స్టేషన్లో ఉన్న నలుగురు పోలీసులు భర్త కళ్ళముందే పైశాచికంగా బలాత్కారం చేశారు. పైగా వాళ్లతో పెట్టుకుంటే నవ్వులపాలు అవుతారని హెచ్చరించి మరీ పంపారు. ఆ సంఘటన జరిగినప్పుడు అనుకోకుండా అక్కడకు వెళ్ళిన పోలీస్ఇన్ఫార్మర్ ద్వారా అది బయటకు వచ్చింది. భార్యాభర్తలిద్దరూ అమితమైన అవమానానికి లోనయి ఈ సంఘటన జరిగినప్పటి నుంచీ ఇంట్లో నుంచి బయటకు రావట్లేదు. ఆ యువతి అరవింద, జరిగిన సంఘటన తాలూకు శారీరక, మానసిక హింస నుంచి ఇంకా తేరుకోలేదు.

భారతి, రవి ఆ జంటను కలిసి జరిగిన ఘోరాన్ని పైవాళ్లకు రిపోర్టు ఇస్తే ఆ పోలీసుల మీద తగిన చర్య తీసుకోబడుతుదని, వదిలేస్తే ఇలాగే మరో ఆడదాని బ్రతుకు బండలు అవ్వచ్చునని నచ్చజెప్పి, వారిని రిపోర్టు ఇవ్వడానికి ఒప్పించారు. భార్యాభర్తలిద్దరూ చివరికి ఒప్పుకున్నారు. అయితే మర్నాడు కావలసిన కాగితాల మీదసంతకాల కోసం రవి వెళ్తే అప్పుడు వారు  సంతకాలు చేయడానికి నిరాకరించారు.

“మమ్మల్ని ఇలా బతకనివ్వండి అయ్యా. మేము ఎవరిమీదా కేసు వెయ్యం. నలుగురిలో మా పరువు పోతుంది. దయచేసి అర్థం చేసుకోండి. ఈ విషయాన్ని ఇంక వదిలేయండి,” అన్నారు మొగుడూపెళ్ళాలిద్దరూ చేతులు జోడిస్తూ. రవికి మతిపోయింది. ఎందుకలా చేస్తున్నారు?

వాళ్లని కనిపెట్టుకుంటూ ఉండమని బయట నిఘా పెట్టిన గోవింద్ చెప్పాడు అసలు విషయం. “ఆముందు రోజు సాయంత్రం పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు వచ్చి, ‘మీరు కానీ పెదవి విప్పారా... అందరి ముందు మీ ఆవిడను మా స్టేషన్‌కి తీసుకు వెళ్లి, ఓ మూడురోజులు వాడుకుని పంపించేస్తాం. అంతేకాదు, మా పెద్ద అధికారులు ఎవరైనా వస్తే వాళ్లతో గడపటానికి తీసుకువెళుతుంటాం. ఈ విషయం ఇక్కడితోవదిలెయ్యండి. మీ జోలికి రాము’ అని బెదిరించి వెళ్లారండీ. ఇక వారేం కేసు వేస్తారు?” అది మొదటి పరాజయం రవికి. భారతి, రవి వెనుతిరిగి వెళ్లిపోయారు. ఆ మరునాడే అరవింద బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. భారతి కళ్ళల్లో నీళ్లు నిండాయి.

“ఆ అమ్మాయి ఆత్మశాంతికైనా మనం ఏమీ చేయలేమా?” అంది రవితో నీళ్లు నిండిన కళ్ళతో.

“ఆమె భర్తే ముందుకు రానప్పుడు...” రవి ఏదో అనబోయాడు. ఈలోగా అరవింద భర్త ఒక్క పరుగున వచ్చి రవి పాదాల మీద వాలాడు. అతని దుఃఖానికి అంతేలేదు.

“బాబూ, నిన్న రానన్నాను. దాని పరువును దృష్టిలో ఉంచుకుని. ఇవాళ అదే లేదు. ఇంకెందుకు నాకు భయం? నా భార్యను నా కళ్ళ ఎదురుగానే ఆ నలుగురు పోలీసులు ఒకరి తరువాత ఒకరు బలాత్కరించారుబాబు. నేను మూడురోజులు అక్కడ ఉంటే, ఆ మూడురోజులు దానికి నరకం చూపించారు బాబు. మీరు వాళ్ళకి శిక్ష పడేలా చెయ్యాల.”

రవి భారతితో కలిసి వెంటనే వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఆమె శరీరాన్ని శవపరీక్షకు పంపే ఏర్పాటు చేశాడు. ఆ మూడు రోజులు అరవింద ధరించిన దుస్తులను పరీక్షకు పంపాడు. 1910లో కలకత్తాలో సెరోలజీ డిపార్ట్‌మెంట్ స్థాపించబడింది. అప్పటి నుంచి ఇటువంటి కేసులుపరిష్కరించటంలో ఆ డిపార్ట్‌మెంట్ సేవలను గణనీయంగా ఉపయోగించుకుంటున్నారు పోలీస్ శాఖ వారు.

నిజానికి అరవిందది చాలా తేలిక కేసు. ఆమె ధరించిన దుస్తుల మీది వీర్యకణాలని, ఆ పోలీసుల వీర్యకణాలతో పోల్చగానే వారి నేరం ఋజువవుతుంది.

రవి చేసిన మొదటి పని, అరవింద భర్త అనుమతి తీసుకుని ఈ విషయాన్ని వార్తాపత్రికలో వేయించటం. దుర్మార్గులైన ఆ పోలీసులు విషయం ఇంత ప్రాముఖ్యత సంతరించుకుని వార్తాపత్రికలకి ఎక్కుతుందని ఊహించలేదు. ఆ అమాయకపు భార్యాభర్తలని దబాయించి వెయ్యొచ్చని అనుకున్నారు.

ఇందులో ఒక ప్లీడర్, ఒక ప్రముఖ సంఘసేవిక తలలు దూరుస్తారన్నది వారి ఊహకందని విషయం. ఇంక దబాయించటం అనవసరం అనుకున్న వారు తమ నేరాన్ని అంగీకరించారు కోర్టులో. 'ఇక దీనిపై విచారణ అనవసరం, మేము నేరం ఒప్పుకుంటున్నా' మని వారు ఇచ్చిన నేరాంగీకార పత్రం వలన కేసు తేలిపోయింది. ఆ ముగ్గురూ ఉద్యోగులు పోలీస్ శాఖలో ఉండటం వలన న్యాయస్థానం వారి నేరాన్ని తీవ్రంగా పరిగణించి ఉద్యోగం నుంచి తొలగించటమే కాక, యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

ఈ సంఘటనతో భారతికి దేశవ్యాప్తంగా కూడా గుర్తింపు వచ్చింది. ఈ సంఘటన భారతిలో ఆలోచనలను రేకెత్తించింది. ఇన్నాళ్లు తాను గృహహింస వరకే దృష్టి సారించింది. కానీ సమాజంలో రక్షించవలసిన వారే భక్షించే పరిస్థితులు కూడా నెలకొని ఉన్నాయి. ఇటువంటి వాటిని కూడా ఎదుర్కొనే వ్యవస్థను కూడా 'అందరిల్లు' కలిగి ఉండాలి. రవితో ఈ విషయం మాట్లాడింది భారతి.

పార్వతీశంతో కూడా సంప్రదించాడు రవి. ముగ్గురూ కలిసి అదే ఊరిలో ఉన్న ఒక వైద్యురాలిని, ఒక వకీలును, రిటైర్ అయిన పోలీస్ శాఖకు చెందిన ఒక ఉన్నతోద్యోగిని కూడా కలుపుకుని ఒక కమిటీగా ఏర్పడ్డారు. భవిష్యత్తులో మహిళల మీద ఎటువంటి అత్యాచారాలు జరిగినా, గృహహింస సంఘటనలు జరిగినా ఆ యువతికి కావలసిన ప్రాథమిక వైద్యం, చట్టపరమైన సహాయం గురించి ఈ కమిటీచూసుకుంటుంది. ఈ విధంగా మహిళారక్షణ కోసం ఒక ఏర్పాటు చేశాక భారతికి మనశ్శాంతి లభించింది.

అంతటితో ఆగకుండా ఆంధ్రరాష్ట్రంలోని స్త్రీలమీద దురదృష్టవశాత్తూ ఏ అత్యాచార సంఘటన ఏ మూలజరిగినా అది వెంటనే 'అందరిల్లు' న్యాయ విభాగానికి తెలిపేందుకు ఊరూరా కార్యకర్తలను నియమించింది భారతి. ఈ కార్యక్రమాలనన్నింటినీ చేస్తూనే, రవి ప్రోత్సాహంతో భారతి తన చదువు మీద కూడా దృష్టి పెట్టింది. ముందుగా బి.ఏ.

పూర్తి చేసింది. అనంతరం భర్త ప్రోత్సాహంతో 'లా' చదవటం మొదలు పెట్టింది .శ్రీరామ్, హరిణిల పోషణ భారం శారదమ్మ తీసుకోవటంతో చదువుకు, సాంఘిక సేవకు కూడా సమయం
కేటాయించ గలుగుతోంది భారతి.

★★★★★

'అందరిల్లు' సేవాకార్యక్రమాల్లో భాగంగా మరోశాఖను ప్రారంభించి దానిని చూసుకునే బాధ్యతను మురారికి అప్పగించారు. మురారి ఆలోచనలు మరో కొత్త సమస్య మీదకు మళ్ళాయి. ఎంతో మంది స్త్రీలు, పిల్లలు పోషకాహార సమస్యతో బాధ పడుతున్నారు. ఆ సమస్యను భారతి ముందు ఉంచాడు. ముఖ్యంగా చదువుకొనే వయసు ఉన్న పిల్లల్లో అనేక మంది బలహీనంగా ఉండటం అతని మనసును కలచివేసింది.

భారతి కూడా ఈ సమస్యపై దృష్టి సారించింది. రవి ఆమెకు ఒక చక్కని సలహా నిచ్చాడు. ఆమెకు 'మహిళారత్న' అవార్డు ప్రదానం చేసేటప్పుడు ముఖ్యమంత్రి గారు, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా, తననుకలవమని చెప్పిన సంగతి ఆమెకు గుర్తు చేసాడు.

"వెంటనే ఆయన కార్యదర్శితో మాట్లాడి ఆయనను కలిసేందుకు సమయం తీసుకుందాం. ఎందుకంటే ఈ సమస్య ఒక్క ఊరిది కాదు. మన రాష్ట్రం మొత్తానిది. ఏమన్నా ప్రభుత్వ సహకారంతో చెయ్యగలిగితేనే ఇటువంటి బృహత్కార్యక్రమాలు విజయవంతమయ్యేది. మనం మన ట్రస్ట్ నుండి పెద్ద మొత్తం 'శయనమ్మ పోషకాహార పథకం' పేర జమచేసి, ప్రభుత్వ సహకారంతో పదేళ్ల లోపల పిల్లలకు పోషకాహారం అందించేందుకు నడుం కడదాం."

ఈ పథకాన్ని గురించి విన్న ముఖ్యమంత్రి గారు చాలా ఆనందించారు.

"మీ ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలోనే దీన్ని ప్రారంభిద్దాం. ఇంత గొప్ప కార్యక్రమం మా ప్రభుత్వ హయాంలో ప్రారంభింప పడటం మాకు గర్వకారణం, 'శయనమ్మ బాల పోషకాహార పథకం' నిధుల సమీకరణకు మీరు ఆలోచించవద్దు. మీరు ఇవ్వదలచింది మీరు ఇవ్వండి. మిగిలిన నిధులు ప్రభుత్వం చూసుకుంటుంది. ఈ పథకం విజయవంతం అయ్యేందుకు కావలసిన వసతులన్నీ కూడా మేము సమకూరుస్తాం. ఇది శయనమ్మగారి ప్రజాసేవకు మేము ఇచ్చే నివాళిగా భావిద్దాం" అన్నారు. కృతజ్ఞతతో నమస్కరించింది భారతి.

మరునాటి వార్తాపత్రికలన్నింటిలో భారతి ఆధ్వర్యంలో ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమం గురించి వచ్చింది. రాష్ట్రమంతటా భారతి చేస్తున్న ఈ సాంఘిక సేవ గురించి తెలిసింది.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS